క్లుప్తంగా

అమ్మవారి సేవలో న్యాయమూర్తి



ఉయ్యూరు: శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మ తల్లిని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు న్యాయమూర్తి శ్రీహరికి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

చిన్నారులకు చేరువగా అంగన్‌వాడీ కేంద్రాలు

నున్న(విజయవాడరూరల్): పిల్లలకు నాణ్యమైన ఆహారం, విద్యను అందించడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారులకు చేరువ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జొన్నలగడ్డ కవిత, సీహెచ్ శ్యామలత అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. నున్న జెడ్పీ హైస్కూల్లో పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

రిలే దీక్షలు



ఉయ్యూరు: చార్ట్ కౌన్సిలింగ్‌ను వెంటనే రద్దు చేయాలని ఎన్‌ఎంయూ జోనల్ సెక్రటరీ అడపా రామారావు అన్నారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఏర్పాటుచేసిన చార్ట్ కౌన్సిలింగ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి ఎన్‌ఎంయూ ఉయ్యూరు డిపో కమిటీ ఆధ్వర్యాన రిలే దీక్షలు చేపట్టారు. శిబిరాన్ని అడపా రామారావు ప్రారంభించి మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ సర్క్యులర్‌కు విరుద్ధంగా చార్ట్ కౌన్సిలింగ్ చేపట్టడం సరికాదన్నారు. ఉద్యోగ, కార్మికులను ఇబ్బందులు పెడుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అధికార పార్టీకి చెందిన యూనియన్ నేత ఆదేశాల మేరకే చార్ట్ కౌన్సిలింగ్ నిర్వహించారని ఆరోపించారు. డిపోలో 60 మంది ఉద్యోగ, కార్మికుల విషయంలో డీఎం ఏకపక్ష వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. దీక్షలో ఎండీ ఉమర్, అబ్దుల్ షఫీ పాల్గొన్నారు. ఎన్‌ఎంయూ డిపో సెక్రటరీ కృష్ణ పర్యవేక్షించారు.

కూలీ దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ దుర్మరణం చెందాడు. బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట నుంచి ఏలూరు జిల్లా నూజివీడు మండలం గొల్లపల్లికి ట్రాక్టర్‌పై ఎండు గడ్డి తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ట్రాక్టర్ వెళ్లుతుండగా గడ్డి లోడుకు కట్టిన తాడు ఒక్కసారిగా తెగిపోవడంతో ట్రాక్టర్ వంతెన రైలింగ్ మీదకు ఒరిగిపోయింది. దాదాపు 15 అడుగుల ఎత్తున గడ్డి లోడుపైనా కూర్చున్న ఇద్దరు కూలీల్లో ఒకరు కింద ఉన్న సర్వీస్ రోడ్డుపైకి జారిపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడుకానుమోలుకు చెందిన భువనేష్ (28)గా పోలీసులు గుర్తించారు. మరో కూలీ గడ్డి లోడుకు ఉన్న తాడుకు పట్టుకుని వేలాడుతూ కిందకు దిగడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాఫ్ట్‌బాల్‌లో కంకిపాడు జెడ్పీ స్కూల్ విద్యార్థుల సత్తా



కంకిపాడు: సాఫ్ట్‌బాల్ జిల్లా విజేతగా కంకిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులు నిలిచారు. జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం జీబీకే సుధారాణి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 11, 12, 13 తేదీల్లో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 84వ గ్రిగ్ మెమోరియల్ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో జిల్లా స్థాయిలో సెంట్రల్ జోన్‌లో జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ విన్నర్స్‌గా నిలిచారన్నారు. సత్తా చాటిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు లకనం దుర్గాప్రసాద్‌ను ఎంఈఓ కేవీఎస్ ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ అజ్గర్ షరీఫ్, ఉపాధ్యాయులు అభినందించారు. హిందీ ఉపాధ్యాయిని జి.బబిత విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రత్యేక బహుమతులు అందించారు.

ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు

పాతపాడు(విజయవాడరూరల్): ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. శుక్రవారం పాతపాడు గ్రామంలో ఇంకుడు గుంతల ఏర్పాటుపై సచివాలయం ఉద్యోగులతో ఆయన మాట్లాడారు. కార్యదర్శి పి.కోటిలింగమ్మ, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ ఇంకుడు గుంతలు తవ్వే ప్రాంతాలను పరిశీలించారు.

ఆపే 'దమ్ము'ందా..

- పెనమలూరు'లో యథేచ్ఛగా రోడ్లపై దమ్ము ట్రాక్టర్లు
- రోడ్లు ఛిద్రం
- పట్టించుకోని అధికారులు



ఈడుపుగల్లులో ఇనుపబద్దీ లేకుండా రోడ్డుపై సంచరిస్తున్న దమ్ము ట్రాక్టర్

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గంలో దమ్ము ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. సీజన్ ఏదైనా రహదారులు చిత్తు చిత్తు కావటం పరిపాటిగా మారింది. దమ్ము ట్రాక్టర్ల సంచారంపై పర్యవేక్షణ కొరవడటంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు దమ్ము ట్రాక్టర్ల కింద నలిగి అధ్వానంగా మారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం రబీ సీజన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సీజన్‌లో పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో వరి సాగు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే వరి నారుమడులు నాట్లకు సిద్ధం కావటంతో వరి నాట్లు సాగుతున్నాయి. రబీకి అనువైన విత్తన రకాలను ఎంచుకుని సాగుకు ఉపక్రమించారు.

దూసుకుపోతోన్న దమ్ము ట్రాక్టర్లు

వరి నాట్లకు పొలాలను సిద్ధం చేసుకునేందుకు రైతాంగం దమ్ము పనులు చేస్తున్నారు. దీనికి దమ్ము ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. పొలాలను దమ్ము చేసిన ట్రాక్టర్లు నేరుగా రోడ్లపైకి ఎక్కి రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారులపై రాకపోకలు సాగించాలంటే నిబంధనల ప్రకారం దమ్ము చక్రాలకు ఇనుప బద్దీ కట్టి వాహనాలను నడపాల్సి ఉంది. కానీ కొందరు ట్రాక్టరు యజమానులు నిబంధనలు ఉల్లంఘించి ట్రాక్టర్లను నడుపుతున్నారు. దమ్ము చక్రాలకు ఇనుప బద్దీ తగిలించకుండానే వెళ్లడంతో లక్షలు వెచ్చించి నిర్మించిన రహదారులు ధ్వంసమవుతున్నాయి. రాళ్లు లేచి గోతులుమయంగా, మార్జిన్‌కు కోతకు గురై ప్రమాదకరంగా తయారవుతున్నాయి.

పర్యవేక్షణ ఏదీ?

జాతీయ రహదారితో పాటుగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జెడ్పీ, లింకు రోడ్ల మీదుగా దమ్ము ట్రాక్టర్లు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ట్రాక్టర్ల కారణంగా ఆయా రహదారులు ధ్వంసమై అధ్వానంగా మారుతున్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో దమ్ము ట్రాక్టర్లు రోడ్లపైకి ఇనుపబద్దీ లేకుండా రాకపోకలు సాగించడం, రోడ్లు పాడవ్వడం సర్వసాధారణంగా మారింది. రోడ్లు దెబ్బతింటున్నా ఆయా శాఖల అధికారులు ఏ ఒక్కరూ ఈ దమ్ము ట్రాక్టర్లను కట్టడి చేసింది లేదు. అధికారుల ఉదాసీన వైఖరితో రోడ్లు నడవడానికి వీల్లేని విధంగా మారుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకుంటేనే రోడ్ల పర్యవేక్షణ సాధ్యమవుతుందని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ట్రాక్టరు యజమానులు నిబంధనలు పాటించాలి. దమ్ము చక్రాలకు ఇనుప బద్దీ తప్పనిసరిగా వినియోగించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అనంతరం పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేసేలా సిఫారసు చేస్తాం.

– చింతా కిరణ్‌కుమార్, ఈఓ, ఈడుపుగల్లు

వ్యవసాయ శాఖ అధికారుల బృందం పర్యటన



తెంపల్లిలో మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గన్నవరంరూరల్: తెంపల్లిలో శుక్రవారం జిల్లా రైతు వనరుల కేంద్ర బృందం పర్యటించింది. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద సమావేశం నిర్వహించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చర్చించారు. అనంతరం మినుము పైరు పరిశీలించిన వ్యవసాయ నిపుణులు జ్యోతి రమణి, శ్రీనివాస్, ఏడీఏ సునీల్ మాట్లాడుతూ పంటలకు అవసరానికి మించి పురుగు మందులు స్ప్రే చేయవద్దన్నారు. అవగాహనకు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. భూమి దెబ్బతినకుండా కాపాడుకోవాలని చెప్పారు. రేపటి తరానికి సారవంతమైన భూములు ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీరు, మందుల వినియోగం సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏటా పచ్చిరొట్ట పైరును సాగుచేసుకుంటే అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యమన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వై.రజని, పద్మజ, వీఏఏ శివనాగరాజు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశువైద్య విద్యార్థుల ఆందోళన



రిలే దీక్షలో వెటర్నరీ విద్యార్థులు

గన్నవరం: స్టైఫండ్ పెంచాలని కోరుతూ స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరుకున్నాయి. రిలే దీక్షలో విద్యార్థులు సాత్విక, రేవతి, జగన్‌మోహన్‌రెడ్డి, భానుప్రకాష్ బైఠాయించారు. వీరికి మిగిలిన విద్యార్థులు సంఘీభావం తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ చాలీచాలని ఉపకార వేతనాలతో వెటర్నరీ విద్యార్థులు చదువులు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెడికల్, డెంటల్ విద్యార్థులతో సమానంగా వెటర్నరీ విద్యార్థులు కూడా ఉపకార వేతనాలు, ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిపై ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించే వరకు తరగతులను బహిష్కరించి ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థి సంఘ నేతలు పాల్గొన్నారు.

10 గ్రామాల్లో చెత్త డంపింగ్ కేంద్రాలు

నున్న(విజయవాడ రూరల్): విజయవాడ రూరల్ మండలంలోని పది గ్రామాల్లో చెత్త డంపింగ్ కేంద్రాలు పని చేస్తున్నాయని ఈఓఆర్డీ మన్నే దుర్గాప్రసాద్ తెలిపారు. నున్నలో చెత్త డంపింగ్ కేంద్రాన్ని శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జి డి.శ్రీనివాసరావు సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, పైడూరుపాడు, రాయనపాడు, గూడవల్లి, నిడమానూరు గ్రామాల్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ప్రతి గ్రామంలో తడిచెత్త, పొడిచెత్తను ఇంటింటికెళ్లి సేకరించి చెత్త నుంచి సంపద సృష్టించడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఏలూరు రోడ్డులోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లోని చెత్తను నిడమానూరు గ్రామానికి తరలించే విషయంపై అధికారులు చర్చలు జరుపుతున్నారని చెప్పారు. గొల్లపూడిలో నాలుగు గ్రామాలకు కలిపి చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే ఆలోచన జరుగుతుందని చెప్పారు. ఈ గ్రామాల్లో వాన పాముల ఎరువులను తయారు చేసి ఆయా గ్రామ పంచాయతీలకు ఆదాయం రావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నున్న చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఇంకా సమర్థంగా పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

'అసాంఘిక' జోరుకు అడ్డేది!



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఎనికేపాడులోని కళాశాల వెనుక ఖాళీ స్థలం (ఇన్‌సెట్) రూరల్‌లో నిర్మానుష్య ప్రాంతంలో దర్శనమిస్తున్న ఖాళీ మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో జన సంచారం లేని నిర్మానుష్య ప్రాంతాలు అడ్డాలుగా మారుతున్నాయి. రామవరప్పాడు రైల్వే స్టేషన్ సమీపంలో, రెండో కాలువ దిగువ ప్రాంతంలో, ప్రసాదంపాడు రైల్వే ట్రాక్ సమీపంలో ఎనికేపాడు విజయ కళాశాల వెనుక పొలాలు, 100 అడుగుల రోడ్డు, నిడమానూరు జనచైతన్య ప్లాట్లలో ఇటువంటి కార్యకలాపాలు నిత్యకృత్యమవుతున్నాయి. రామవరప్పాడు రైల్వే స్టేషన్ సమీపంలో రాత్రి అయితే చాలు మందుబాబుల వీరంగం నానాటికీ పెరిగిపోతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌కు వెళ్లే రోడ్డు రాత్రిళ్లు నిర్మానుష్యంగా ఉండటంతో ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారు.

గ్రామస్తుల ఆందోళన

మందు బాబులు మద్యం సేవించి వారిలో వారు దాడులకు పాల్పడుతుంటారని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. రెండో వంతెన దిగువ ప్రాంతంలో కూడా ఇటువంటి ఘటనలు పెచ్చుమీరుతున్నాయి. బయట ప్రాంతాల నుంచి గంజాయి బ్యాచ్ ఇక్కడకు వచ్చి గ్రూపులుగా విడిపోయి ఘర్షణలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో గంజాయి బ్యాచ్ మధ్య జరిగిన గొడవలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేశారని, మరో ఘటనలో వృద్ధురాలిని మత్తులో హతమార్చారని గుర్తు చేస్తున్నారు. ప్రసాదంపాడు రైల్వే ట్రాక్ సమీపంలో మందుబాబుల ఆగడాలు అధికమవుతున్నాయి. ఈ ప్రాంతంలో జన సంచారం తక్కువగా ఉండటంతో ఇలాంటి కార్యకలాపాలు నిత్యకృత్యమవుతున్నాయి. వీరి ఆగడాలపై ఎవరైనా ప్రశ్నిస్తే మందు బాబులు బూతులతో సమాధానం ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిడమానూరు గ్రామం చివర ఉన్న పొలాల్లో జూదాలు ఆడటం, మద్యం సేవించడం పరిపాటి. ఈ ప్రాంతం ముళ్ల పొదలతో నిర్మానుష్యంగా ఉండటంతో వీరి పనులు సులువు అవుతున్నాయి. రాత్రి అయితే చాలు జాతీయ రహదారికి ఇరువైపులా జరిగే అకృత్యాలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎనికేపాడు విజయ కళాశాల వెనుక ఉన్న ఖాళీ స్థలాల్లో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా జరుగుతున్నాయి. జనావాసాలకు దూరంగా ఉన్న ఈ ప్రాంతంలో కార్లు, ద్విచక్రవాహనాలపై జులాయిలు ఇక్కడకు చేరుకుని ఈ తంతు సాగిస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో వరుసగా గ్రూపు తగాదాలు, గ్యాంగ్ వార్‌లు కూడా చోటు చేసుకున్నాయి.

ప్రత్యేక నిఘా అవసరం

పోలీసులు మరింతగా నిఘా పెంచాలని పలు గ్రామాల వారు కోరుతున్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో ఎక్కువగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా రాత్రుళ్లు పెట్రోలింగ్ నిర్వహించాల్సినా పోలీసులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రామవరప్పాడు రైల్వే స్టేషన్ సమీపంలో, ఎనికేపాడు విజయ కళాశాల వెనుక వైపు ఉన్న పొలాల్లో, నిడమానూరులోని నిర్మానుష్య ప్రాంతాలు, జాతీయ రహదారిపై పోలీసులు మరింత దృష్టి కేంద్రీకరించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

యువతి కనిపించడం లేదని ఫిర్యాదు

పెనమలూరు: యనమలకుదురులో యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో శివాలయం ప్రాంతంలో వి.నారాయణ కుటుంబం నివసిస్తోంది. అతనికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె వి.దేవి గతంలో హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి ఆరు నెలలుగా యనమలకుదురులో ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 12న విజయవాడలో కారు ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని ఇంటి నుంచి వెళ్లింది. అదే రోజు సాయంత్రం సోదరుడు సాయికి ఫోన్ చేసి తాను ఇంటి నుంచి వెళ్లి పోతున్నానని, అక్కడ ఉండటం ఇష్టం లేదని తెలిపింది. ఆ తర్వాత దేవి ఇంటికి రాలేదు. ఆమె కోసం పలుచోట్ల వెదికినా ఆచూకీ తెలియలేదు. ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. బోసుబొమ్మ సెంటర్, సంజీవయ్యనగర్, లంబాడీపేట, డబ్బా పంపు సెంటర్, రామాలయం, కరకట్ట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పలూరు, మద్దూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా ఉప్పలూరు, మంతెన, మద్దూరు, గొడవర్రు గ్రామాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు.. ఎన్నికల కోడ్ అమలేదీ!

- తొలగించని ఫ్లెక్సీలు
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్



కానూరులో ఎమ్మెల్యే సుజనాచౌదరి ఇంటి వద్ద ఫ్లెక్సీలు

పెనమలూరు: ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్ అమలు చేయాలని ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ విధిగా అమలు చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తాడిగడప మున్సిపాలిటీలో ఎన్నికల కోడ్ అమలుకావడం లేదు. విజయవాడ వెస్టు ఎమ్మెల్యే సుజనాచౌదరి ఇల్లు కానూరు ఇంజినీరింగ్ కాలేజీ ఫ్లైవోవర్ వద్ద ఉంది. ఆయన ఇంటి ముందు రోడ్డు పక్కనే పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు పెట్టారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి చాలా రోజులైనా తాడిగడప మున్సిపాలిటీ అధికారులు రోడ్డు పక్కనే ఉన్న ఫ్లెక్సీలు మాత్రం తొలగించడం లేదు. ఎన్నికల కమిషన్ ఆదేశాలంటే తాడిగడప మున్సిపాలిటీ అధికారులకు లెక్కేలేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభల ప్రదర్శనలో భద్రత పాటించాలి

సీఐ వెంకటరమణ



యనమలకుదురులో ప్రభల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

పెనమలూరు: యనమలకుదురులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో ప్రభల ప్రదర్శనలో జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ జె.వెంకటరమణ తెలిపారు. యనమలకుదురు వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం ప్రభల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ వెంకటరమణ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలో అధికారికంగా 27 ప్రభలు గిరి ప్రదక్షిణ చేస్తాయన్నారు. దేవుడి ప్రభ ముందుగా ప్రారంభమవుతుందన్నారు. ఆ తర్వాత ప్రభలు వారికి కేటాయించిన సీరియల్ ప్రకారం కదలాలన్నారు. ప్రభల నిర్వాహకులు దరఖాస్తు చేసి ముందుగా అనుమతులు పొందాలని సూచించారు. నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేయరాదన్నారు. శివరాత్రి రోజున గ్రామంలో మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్, ఫిరోజ్, ఈవో ఎన్.భవాని, ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండో రోజు వైఎస్సార్ సీపీ నేతల అక్రమ నిర్బంధాలు



జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణిని నిర్బంధించిన పోలీసులు

గన్నవరం: మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అరెస్ట్ నేపథ్యంలో శుక్రవారం కూడా నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతల అక్రమ నిర్బంధాలు కొనసాగాయి. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణిని వరుసగా రెండో రోజు స్థానిక రాయ్‌నగర్‌లోని ఆమె నివాసంలో నిర్బంధించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును ఆమె తీవ్రంగా ఖండించారు. అక్రమ అరెస్టులు, వైఫల్యాలను ప్రశ్నిస్తునందుకే ప్రభుత్వం ఈ అక్రమ నిర్బంధాలకు దిగిందని మండిపడ్డారు. నియోజకవర్గ ప్రజలకు సేవా కార్యక్రమాల ద్వారా 18 ఏళ్లుగా అన్ని రకాలుగా అండగా నిలిచిన వంశీమోహన్‌పై అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ఈ దగాకోరు ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

పోషకాహార లోపం తలెత్తకుండా చర్యలు

ఉయ్యూరురూరల్: చిన్నారుల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు వెయ్యి రోజుల ప్రణాళికలను అమలు చేయాలని ఐసీడీఎస్ నోడల్ అధికారి భానుమతి సూచించారు. ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయంలో రెండో రోజు శుక్రవారం పోషణ్ భీ పడాయి భీ శిక్షణ కార్యక్రమం కొనసాగింది. భానుమతి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. తల్లిపాలు ఇస్తే కలిగే ప్రయోజనాలను ముందస్తుగా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణిగా ఉన్నప్పుడు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. చిన్నారుల వయసు మేరకు ఆహారం అందించడంలో నిర్దిష్ట పరిపూర్ణమైన ప్రాముఖ్యాన్ని పాటించాలన్నారు. సమతుల్యమైన ఆహారం అందేలా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన పెంపొందించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందిస్తే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. 0–6 ఏళ్ల నడుమ మానసిక, శారీరక వైకల్యాలను గుర్తించి భవిత సెంటర్లకు పంపాలని డాక్టర్ గోపీచంద్ సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ కేబీ సుకన్య, సూపర్‌వైజర్ బేబిసరోజిని, కల్యాణి వర్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి జీవనోపాధిపై శిక్షణ

ఉయ్యూరురూరల్: ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో మెప్మా సిబ్బంది స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. మెప్మా యంత్రాంగానికి ఎండీ తేజ్ భరత్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి, పేదరిక నిర్మూలన, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, ఎస్‌ఎంఎస్‌ఈలపై జూమ్ ద్వారా శిక్షణ ఇచ్చారు. రానున్న కాలంలో మెప్మా టీఎల్‌ఎఫ్ పరిధిలో స్వయంశక్తితో ఎదిగేలా ప్రతినిధులు సమాలోచనలు చేయాలని సూచించారు. అందుకు పట్టణంలో సూపర్‌మార్కెట్, చిల్డ్రన్ గేమ్స్ పార్కు లాంటి ప్రయోజనకరమైన వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం దయావతి, పీఓలు రాజేంద్ర, శ్యామల, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని విజయవాడ జోన్ ఏఎఫ్‌డీ ఎం.హర్షవర్ధన్ అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డు శుభకృష్ణ ఎన్‌క్లేవ్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్‌లో ఖాతాదారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు బీవోఐ ఇతోధికంగా రుణాలు మంజూరు చేస్తుందని హర్షవర్ధన్ చెప్పారు. రైతులకు వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాల మంజూరులోనూ బీవోఐ ముందంజలో ఉందని వివరించారు. బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ఉంగుటూరు: టెన్త్ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోవాలని హెచ్‌ఎం టీ.సీతారామ్ అన్నారు. ఇందుపల్లి, తేలప్రోలు, ఉంగుటూరు, మానికొండ గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుకు 'సాక్షి' స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సాక్షి యాజమాన్యం స్టడీ మెటీరియల్ అందించినందుకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. దాతల తోడ్పాటును వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ముమ్మరంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్

గన్నవరంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలు రైతులందరికీ అందడానికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం కొనసాగుతోంది మండల వ్యవసాయాధికారి వై.రజని చెప్పారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రైతులు ముమ్మరంగా ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలో 800 మంది రైతులు పైగా భూములను ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. మిగిలిన వారు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

22 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లిలో ఈ నెల 22 నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గుదె ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 90522 66216, 91827 71744 నంబర్లలో సంప్రదించాలని కోరారు.